## షార్ట్‌సర్క్యూట్‌తో మూడిండ్లు దగ్ధం



బీర్కూర్‌లో మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 27 : షార్ట్‌సర్క్యూట్‌తో మూడు పెంకుటిండ్లు దగ్ధమైన ఘటన బీర్కూర్ మండల కేంద్రంలో గురువారం చోటు చేసుకున్నది. బీర్కూర్ గ్రామానికి చెందిన శాంతవ్వ, గంగమణి, సాయవ్వకు చెందిన మూడు ఇండ్లు కాలిపోయాయి. బాధితులు ఇండ్లకు తాళం వేసి గ్రామంలోని శివాలయంలో పూజలు చేయడానికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి మూడు ఇండ్లకు నిప్పు అంటుకుని మంటలు వ్యాపించాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. మంటల్లో ధాన్యం, వంట సామగ్రి, దుస్తులు, విలువైన వస్తువులు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.ఆరు లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని బాధితులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రాజశేఖర్, స్థానిక నాయకులు పరిశీలించారు.

**రామారెడ్డి మండలం సున్నపురాళ్ల తండాలో పూరిగుడిసె..**

రామారెడ్డి, ఫిబ్రవరి 27: రామారెడ్డి మండలంలోని గొడుగు మర్రి తండా గ్రామ పంచాయతీ పరిధిలోని సున్నపురాళ్ల తండాలో బుధవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో నివాసపు గుడిసె దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బట్టు దేవకి, జమునకు చెందిన గుడిసెకు షార్ట్‌సర్క్యూట్‌తో ఆకస్మికంగా మంటలు చెలరేగి గుడిసె కాలి బూడిదైంది. అందులో మూడు క్వింటాళ్ల బియ్యం, రెండు క్వింటళ్ల మక్కజొన్నలు, వెండి, నగదు, నిత్యావసర సరుకులు పూర్తిగా కాలిపోయాయి. కామారెడ్డి నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను ఆర్పివేసింది. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.



గొడుగు మర్రి తండాలో కాలిపోతున్న గుడిసె

## మార్చి 2న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కామారెడ్డి, ఫిబ్రవరి 27 : జిల్లా కేంద్రంలోని స్టేషన్ రోడ్డులో ఉన్న ఓరియంటల్ పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని మార్చి 2వ తేదీన నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా కమిటీ అధ్యక్షుడు న్యాయవాది రాంచంద్రారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాల ప్రారంభమైనప్పటి నుంచి (1964) నేటి వరకు పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

# 'హరితహారం' చెట్ల నరికివేత




రోడ్డుకు ఇరువైపులా పచ్చదనంతో కళకళలాడుతున్న హరితహారం చెట్లు




నరికివేతకు గురైన చెట్లు

- పట్టించుకోని అధికారులు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పర్యావరణ ప్రేమికులు

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 27 : 'పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు' అన్న లక్ష్యంతో బీఆర్ఎస్ హయాంలో హరితహారం కార్యక్రమం చేపట్టి మొక్కలు నాటారు. ప్రస్తుతం ఆ మొక్కలు ఏపుగా పెరిగి చెట్లయ్యాయి. చల్లని నీడనిస్తూ.. అందంగా, అకర్షణీయంగా కనిపించే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు నేడు నరికివేతకు గురవుతున్నాయి. జిల్లాలోని పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్, పోలీస్ స్టేషన్ నుంచి కాటేపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను కొందరు జేసీబీ సహాయంతో నరికి వేశారు. పదేండ్ల క్రితం బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా అప్పటి ఎస్సై నవీన్‌కుమార్ రోడ్డుకు ఇరువైపులా మొక్కలను నాటించి ప్రత్యేక శ్రద్ధ చూపారు. ప్రతిరోజూ సిబ్బందితో పాటు తాను నీళ్లు పోసి సంరక్షించారు. ఆ మొక్కలే నేడు చెట్లుగా మారి ప్రయాణికులకు నీడనిస్తూ సేద తీరుస్తున్నాయి. కానీ.. ప్రస్తుతం ఆ చెట్లను నరికేస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని కొమ్మలు తొలగించకుండా ఏకంగా చెట్లనే నరికేస్తున్నారు. కొన్ని విద్యుత్ తీగలకు సంబంధం లేని చెట్లను చిగురించేందుకు వీలు లేకుండా మొదళ్ల వరకూ నరికేస్తున్నారు. తీగలకు తగిలే కొమ్మలను తొలగించకుండా చెట్లను మొత్తం నరికేస్తుంటే పంచాయతీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. చెట్లను ఇష్టం వచ్చినట్లు నరికేస్తున్నా అధికారులు కనీస చర్యలు చేపట్టడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయమై విద్యుత్ శాఖ అధికారులను వివరణ కోరగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లు చాలాసార్లు విద్యుత్ తీగలకు అడ్డుగా వస్తే కొమ్మలు తొలగించామే తప్ప చెట్లను నరికివేయలేదన్నారు. చెట్ల నరికివేతకు తమకు ఎలాంటి సంబంధం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పర్యావరణ ప్రేమికులు, ప్రజలు కోరుతున్నారు.

### నివేదికను పైఅధికారులకు అందజేస్తాం



పెద్ద కొడప్‌గల్‌లోని సబ్ సేష్టన్ సమీపంలో కాటేపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను అనుమతి లేకుండా జేసీబీతో నరికివేశారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదికను అందజేస్తాం. అనుమతి లేకుండా చెట్లను నరికివేస్తే చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో, పెద్ద కొడప్‌గల్

## బకాయిలు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



ఎల్లారెడ్డిలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఎల్లారెడ్డిరూరల్, ఫిబ్రవరి 2: ఇంటి పన్ను సకాలంలో చెల్లించి, పట్టణ అభివృద్ధికి సహకరించాలని ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ మహేశ్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో పన్నుల వసూలు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సిబ్బంది బృందాలుగా తిరుగుతూ పన్ను వసూలు చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు తిరిగిన మున్సిపల్ సిబ్బంది 30 వేల రూపాయల పన్ను వసూలు చేశారు. కమిషనర్‌వెంట కారోబార్ దేవదాస్, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

## ఆకట్టుకున్న కుస్తీ పోటీలు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 27 : నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామ రాజరాజేశ్వర ఆలయం వద్ద కుస్తీ పోటీలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల నుంచి వచ్చిన మల్లయోధులు పోటీలో పాల్గొనడంతో పోటీలు రసవత్తరంగా సాగాయి. రూ.50 కుస్తీ మొదలుకుని రూ. రెండు వేల వరకు పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో భారీ జాతర వెలిసింది. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు చంద్రాగౌడ్, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

**నేడు కోర్పోల్ గ్రామంలో కుస్తీ పోటీలు**

లింగంపేట, ఫిబ్రవరి 27: మండలంలోని కోర్పోల్ గ్రామంలో శుక్రవారం కుస్తీ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శివరాత్రి పండుగ సందర్భంగా గ్రామంలో హరిహర దేవాలయం వద్ద పోటీలు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. చివరి కుస్తీ పోటీల్లో గెలుపొందిన వారికి మూడు తులాల వెండి కడియం బహూకరించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో మల్లయోధులు పాల్గొని పోటీలను విజయవంతం చేయాలని వారు కోరారు.



కుస్తీ పోటీలో తలపడుతున్న మల్లయోధులు

## బాధిత కుటుంబానికి పరామర్శ



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్

కామారెడ్డి, ఫిబ్రవరి 27 : ఇటీవల తన కూతురు వివాహంలో గుండెపోటు వచ్చి మృతి చెందిన కుడిక్యాల బాల్‌చంద్రం కుటుంబాన్ని కామారెడ్డి మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ గురువారం పరామర్శించారు. బాలచంద్రం చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు కుంబాల రవి యాదవ్, గరిగంటి లక్ష్మీనారాయణ, గైని శ్రీనివాస్ గౌడ్, భానుప్రసాద్ తదితరులు ఉన్నారు.

## ఓట్ల తొలగింపుపై కలెక్టర్ స్పందించకపోవడం బాధాకరం



మాట్లాడుతున్న బాలు

కామారెడ్డి, ఫిబ్రవరి 27 : పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ కళాశాలలు, పాఠశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకుల ఓట్లను తొలగించారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని తెలంగాణ లెక్చరర్ల ఫోరం అధ్యక్షుడు బాలు ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైన విద్యావంతులకు ఓటు వేసే అవకాశం లేకపోవడం బాధాకరమని అన్నారు. ఏకపక్షంగా ఓట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. తప్పుడు ఫిర్యాదు చేయడంతో అధికారులు ఓట్లను తొలగించారని అన్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని గురువారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాము ఓటు వేయకుండానే వెనుతిరగాల్సి వచ్చిందని అన్నారు.

## మహిళ అదృశ్యం

కామారెడ్డి, ఫిబ్రవరి 27 : పట్టణంలోని గ్రీన్ సిటీ కాలనీలో నివాసముండే వనం వసంత అదృశ్యమైనట్లు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఈ నెల 25వ తేదీన బంధువు చనిపోతే తన భర్త పాపయ్య అక్కడికి వెళ్లాడు. ఆమె ఒక్కతే ఇంటి వద్ద ఉన్నది. తిరిగి రాత్రి 8 గంటలకు భర్త ఇంటికి వచ్చాడు. ఆమె ఇంటి వద్ద కనబడపోయేసరికి చుట్టు పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ పేర్కొన్నారు.

## వైకుంఠధామానికి దారేది..?

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- దారిపొడవునా పశువుల కళేబరాలు, వ్యర్థపదార్థాలు పారేస్తున్న వైన్యం
- పట్టించుకోని అధికారులు



వైకుంఠధామం కమాన్ వద్ద పెరిగిన మొక్కలు, మట్టి కుప్పలు, కోళ్ల వ్యర్థాలు



దారి పక్కన జంతు కళేబరం

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 27 : బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో వైకుంఠధామాలను ఏర్పాటు చేసింది. నస్రుల్లాబాద్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామానికి దారిలేక ప్రజలు అంత్యక్రియల సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం నిర్మించిన వైకుంఠధామానికి దారి సమస్య నెలకొన్నది. ఈ వైకుంఠధామానికి వెళ్లే దారిలో మాంసాహారానికి సంబంధించిన వ్యర్థ పదార్థాలు వేస్తున్నారు. దీనికి తోడు పశువుల కళేబరాలు కూడా రహదారి పక్కనే వేస్తున్నారు. దీంతో అంత్యక్రియలు చేసే సమయంలో ప్రజలు ఈ రహదారి గుండా వెళ్తున్నప్పుడు వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రహదారి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేశ్‌ను వివరణ కోరగా వైకుంఠధామానికి రహదారి లేని మాట వాస్తవమేనని, పంచాయతీలో నిధులు లేవని, నిధులు వచ్చాక రహదారిని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, AFROZ KHAN S/o SHARE KHAN R/o.H.No.10-13-144/298/10, Drivers Colony ,Nizamabad ,Dist., T.S. Changed My New name as MOHAMMED AFROZ KHAN S/o SHARE KHAN
NTZ-338522

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు



కామారెడ్డి పట్టణంలో ఓటు వేసేందుకు వచ్చిన ఓటర్లు

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఫిబ్రవరి 27: జిల్లా వ్యాప్తంగా గురువారం నిర్వహించిన పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 29 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటుచేశారు. పోలింగ్ కేంద్రాలను కలెక్టర్, సబ్ కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు తనిఖీ చేశారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని బాలుర ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాలలోని 173వ పోలింగ్ స్టేషన్‌లో కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, జిల్లా అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు. దోమకొండ మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎన్నికల కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్, మాచారెడ్డి, పాల్వంచ, బీబీపేట మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి పరిశీలించారు.

ఎల్లారెడ్డిలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జోనల్ ఆఫీసర్ నారాయణ ఆధ్వర్యంలో పోలీసులు, పోలీస్ సిబ్బంది ప్రశాంతంగా ఎన్నికల పోలింగ్ ప్రక్రియను నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు పట్టణంలో పర్యటించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. భారతీయ జనతా పార్టీకి చెందిన మాజీ ఎంపీ బీబీపాటిల్, జిల్లా అధ్యక్షుడు నీలం చిన్నరాజులు, రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి పర్యటించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించారు. నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాలను డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్‌నాయక్, ఆర్డీవో ప్రభాకర్ సందర్శించారు. రామారెడ్డి మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని అధికారులు, స్థానిక తహసీల్దార్ సువర్ణ తెలిపారు. మహ్మద్ నగర్, నిజాంసాగర్‌లోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఓటింగ్ వివరాలపై ఆరా తీశారు. ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. మద్నూర్ మండలకేంద్రంలోని పోలింగ్ కేంద్రాన్ని సబ్‌కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో నిర్వహించిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కేంద్రాన్ని సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. బిచ్కుంద మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పట్టభద్రుల ఓటు హక్కును మాజీ జడ్పీటీసీ నాల్చర్ భారతి, రాజు దంపతులు వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి రెండు పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఓటింగ్ సరళి, ఏర్పాట్లపై ప్రిసైడింగ్, సెక్టోరల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.జుక్కల్ మండల కేంద్రంలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్సై భువనేశ్వర్ బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలోఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు. లింగంపేట మండలంలో ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, కామారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎదురుగట్ల సంపత్‌గౌడ్ దంపతులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సరళిని ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్ పరిశీలించారు. బాన్సువాడ డివిజన్‌లోని 11 మండలాల్లో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా డీఎస్సీ రాజేశ్, పట్టణ, రూరల్ సీఐలు అశోక్, రాజేశ్ బందోబస్తు నిర్వహించారు. బాన్సువాడ మండలంలో పట్టభద్రులు 1,112 మంది ఉండగా 930 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 186 మంది ఉపాధ్యాయులు ఉండగా 178 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. బీర్కూర్ మండలంలో 348 మంది పట్టభద్రులు ఉండగా 298 మంది, 37 మంది ఉపాధ్యాయులు ఉండగా 37 మంది ఓటు వేశారు. నస్రుల్లాబాద్ మండలంలో 326 మంది పట్టభద్రులు ఉండగా 268 మంది, 44 మంది ఉపాధ్యాయులు ఉండగా 42 మంది ఓటు వేశారు. జుక్కల్ నియోజకవర్గంలోని బిచ్కుంద మండలంలో 639 మంది పట్టభద్రులు ఉండగా 460 మంది, 83 మంది ఉపాధ్యాయులు ఉండగా 78 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. డోంగ్లీలో 107 మంది పట్టభద్రులు ఉండగా 81 మంది ఓటు వేశారు. 11 మంది ఉపాధ్యాయులు ఉండగా 10 మంది ఓటు వేశారు. జుక్కల్ మండలంలో 347 మంది పట్టభద్రులు ఉండగా 231 మంది, ఉపాధ్యాయులు 17 మంది ఉండగా 14 మంది, మద్నూర్ మండలంలో 417 మంది పట్టభద్రులు ఉండగా 314 మంది, ఉపాధ్యాయులు 49 మందికిగాను 46 మంది ఓటు వేశారు. మహ్మద్‌నగర్ మండలంలో 221 పట్టభద్రులు ఉండగా 170 మంది, ఉపాధ్యాయులు 14 మందికిగాను అందరూ ఓటు వేశారు. నిజాంసాగర్ మండలంలో 190 మంది పట్టభద్రులు ఉండగా 153 మంది ఓటు వేశారు. పెద్ద కొడప్‌గల్ మండలంలో 211 మంది పట్టభద్రులు ఉండగా 142 మంది, ఉపాధ్యాయులు 18, పిట్లం మండలంలో 487 మంది పట్టభద్రులు ఉండగా 402 మంది, 49 మంది ఉపాధ్యాయ ఎమ్మెల్సీకి 44 మంది ఓటు వేశారు. బాన్సువాడ డివిజన్‌లోని 11 మండలాల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 4,405 ఓటర్లు ఉండగా 3,449 మంది, ఉపాధ్యాయులు 517 మందికి గాను 490 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దోమకొండలో గ్రాడ్యుయేట్స్ 498 మందికిగాను 415 మంది, ఉపాధ్యాయులు 55 మందికిగాను 55 మంది ఓటు హక్కును వియోగించుకున్నట్లు తహసీల్దార్ సంజయ్‌రావు తెలిపారు. బీబీపేటలో గ్రాడ్యుయేట్స్ 536 మందికిగాను 428 మంది, టీచర్లు 40 మందికి గాను 40 మంది ఓటు హక్కును వియోగించుకున్నట్లు ఎంపీడీవో పూర్ణ చంద్రోదయకుమార్ తెలిపారు. మాచారెడ్డి, పాల్వంచ మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అదనపు ఎస్పీ చైతన్యారెడ్డి పరిశీలించారు. మాచారెడ్డిలో పట్టభద్రులు 82శాతం, పాల్వంచలో 86 శాతం, ఉపాధ్యాయ ఎన్నికల్లో మాచారెడ్డిలో 100 శాతం, పాల్వంచలో 93 శాతం పోలింగ్ నమోదైనట్లు తహసీల్దార్లు శ్వేత, లక్ష్మణ్ తెలిపారు.



ఓటు హక్కును వినియోగించుకున్న కలెక్టర్, అదనపు కలెక్టర్లు



ఓటు వేసేందుకు వస్తున్న దివ్యాంగురాలు



కామారెడ్డిలో బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు



సిబ్బందితో మాట్లాడుతున్న బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి



బిచ్కుందలో ఓటు వేసిన బీఆర్ఎస్ పార్టీ మాజీ జడ్పీటీసీ నాల్చర్‌భారతీరాజు దంపతులు



లింగంపేటలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సంపత్‌గౌడ్ దంపతులు



లింగంపేటలో ఓటు వేసిన మాజీ జడ్పీటీసీ ఏలేటి శ్రీలత



మాచారెడ్డి పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న ఏఎస్పీ చైతన్యారెడ్డి